అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ రంజిత్ బాష, జెసి డాక్టర్ నవ్య

ఉల్లి కొనుగోళ్లు.. గందరగోళం

- ప్రభుత్వం ప్రకటించిన ధరకు కొనుగోళ్లు ప్రారంభించిన మంత్రి
- మళ్లీ సరుకుకు రేటు కట్టిన ట్రేడర్లు
- చివరికి ప్రభుత్వమే కొనుగోలు చేసింది

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం గందరగోళం నడుమ ఉల్లి కొనుగోళ్లు సాగాయి. ముఖ్యమంత్రి ఆదేశాలతో క్వింటా రూ.1200కు కొనుగోలును పరిశ్రమల శాఖ మంత్రి టిజి భరత్ సోమవారం ఉదయం ప్రారంభించారు. రైతులు తీసుకొచ్చిన దిగుబడులను పరిశీలించి వారితో మాట్లాడారు. అధిక వర్షాల వల్ల పంట నష్టం చాలా ఉందని, దిగుబడి తగ్గిపోయిందని మంత్రి, రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇంకా సాయం చేయాలని పలువురు రైతులు మంత్రిని కోరారు. గత మూడు రోజులుగా రైతులు తమ ఉల్లి పంటను కర్నూలు మార్కెట్ యార్డుకు తీసుకురావడం, వారు పడుతున్న ఇబ్బందులను గమనించడం జరిగిందని వెంటనే అధికారులతో మాట్లాడి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి ఈ విషయం తీసుకుని వెళ్లడం జరిగిందని తెలిపారు. ఈ కూటమి ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ రైతులకు అండగా నిలబడాలని నిశ్చయించినదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులు ఇబ్బంది పడకూడదని, నష్ట పోకూడదు అన్న ఉద్దేశంతో ప్రభుత్వం స్వతహాగా ముందుకు వచ్చి కిలో రూ.12 చొప్పున కొనడానికి నిశ్చయించి ఈ రోజు నుండి కొనుగోలు ప్రారంభించిందని రైతులకు తెలియజేశారు. ఇటువంటి మంచి పనులు చేయడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎల్లప్పుడూ ముందు వరుసలో ఉంటారని, ఇది కేవలం ఆయనకే సాధ్యం అని మంత్రి టి.జి. భరత్ రైతులకు తెలియజేశారు. రైతులు తమ ఉత్పత్తులను అమ్ముకోటానికి అధికారులతో సహకరించాలని, మెత్తబడిన ఉల్లిని వేరు చేయాలని కోరారు. రైతులు తమ ఆధార్ కార్డును, బ్యాంక్ అకౌంట్ నంబరు, ఈపాస్ రిసిప్ట్ మొదలగునవి అధికారులకు ఇచ్చినట్లు అయితే ఒక వారం లోపల మీ ఉల్లి డబ్బులు మీ బ్యాంక్ అకౌంట్ లో జమ చేయబడుతాయని కావున రైతులు సహకరించాలని మంత్రి కోరారు. మంత్రితో పాటు కడప జెడి మార్కెటింగ్ రామాంజనేయులు, డిప్యూటీ డైరెక్టర్ లావణ్య, కర్నూలు మార్కెటింగ్ ఏడి నారాయణమూర్తి, మార్కెట్ యార్డ్ సెక్రటరీ జయలక్ష్మి, మార్కెట్ యార్డ్ చైర్మన్ గోల్కొండ హజ్మత్ బీ, వైస్ చైర్మన్ శేషగిరి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు, కార్పొరేటర్ పరమేష్ పాల్గొన్నారు.

ఉల్లి కొనుగోళ్లను ప్రారంభిస్తున్న మంత్రి టిజి.భరత్

మంత్రి వెళ్లిపోయిన తరువాత కర్నూలు మార్కెట్‌లోని ఉల్లిని ట్రేడర్లు ధర కట్టి తాము కొంటున్నట్లు రైతులకు చెప్పారు. ప్రభుత్వం కొంటాదో లేదో అని భావించిన రైతులు ట్రేడర్లు చెప్పిన ధరకు విక్రయించారు. సోమవారం మార్కెట్‌కు 1609 క్వింటాళ్ల సరుకు రాగా కనిష్ఠంగా క్వింటా రూ.517 గరిష్ఠంగా రూ.1329కు ట్రేడర్లు కొనుగోలు చేశారు. ఆ వివరాలకు మార్కెట్‌లోని ధరల బోర్డులోనూ ప్రదర్శించారు. అనంతరం మార్కెటింగ్ శాఖ కమిషనర్ విజయ సునీత, కలెక్టర్ పి.రంజిత్ బాషా మార్కెట్‌లో పర్యటించారు. రైతులతో మాట్లాడారు. క్వింటా రూ.1200కు కొనుగోలు చేయడం లేదని రైతులు చెప్పడంతో మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వమే కొంటుందని సరుకును గ్రేడింగ్ చేసుకుని ఇవ్వాలని తెలిపారు. చివరికి ట్రేడర్లు రూ.1200 కంటే తక్కువకు కొనుగోలు చేసి ఉల్లి మొత్తాన్ని మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తున్నట్లు ప్రకటించారు.

ఉల్లి రైతులు నష్టపోకుండా కొనుగోళ్లు చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డ్ లో పర్యటించి, ఉల్లి కొనుగోలు అంశంపై జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, అగ్రికల్చర్ అండ్ మార్కెటింగ్ శాఖ కమిషనర్ విజయ సునీత, జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య పర్యవేక్షణ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉల్లి రైతులు ఎట్టి పరిస్థితుల్లో నష్టపోకూడదనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యుల ఆదేశాల మేరకు మార్క్ ఫెడ్ ద్వారా క్వింటాల్ ఉల్లి పంటను రూ.1200కు కొనుగోలు చేస్తున్నామన్నారు. మార్కెట్ యార్డ్‌కు వచ్చిన ఉల్లి పంటను క్వింటా రూ.1200కు కొనుగోలు చేయాలని కలెక్టర్ మార్క్‌ఫెడ్ అధికారులను ఆదేశించారు. నిర్దేశించిన ఇండెంట్ ప్రకారం రైతు బజార్లకు ఉల్లిని తరలించే విధంగా చర్యలు తీసుకోవడంతో పాటు మిగిలిన నిల్వలను గోడౌన్‌లో ఉంచి అవసరం బట్టి ట్రాన్స్‌పోర్ట్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మార్క్ ఫెడ్ అధికారులను ఆదేశించారు. రైతులు పంట కోతకు వచ్చేవరకు తమ పొలంలో ఉంచి గడ్డ మంచి సైజుకు వచ్చిన తరువాత కోత మొదలు పెట్టాలని, మరియు ఉల్లి గడ్డలను బాగా ఆరబెట్టుకుని మార్కెట్ కి తీసుకురావాలని కలెక్టర్ రైతులకు సూచించారు. మార్క్‌ఫెడ్ డిఎం రాజు, ఉద్యాన శాఖ అధికారి రామాంజనేయులు, మార్కెటింగ్ ఏడి నారాయణ మూర్తి, మార్కెట్ యార్డ్ సెక్రటరీ జయలక్ష్మి ఉన్నారు.

రైతులతో మాట్లాడుతున్న మార్కెటింగ్ శాఖ కమిషనర్, కలెక్టర్

అర్జీలను గడువులోపు పరిష్కరించండి

- కలెక్టర్ రంజిత్ బాషా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ప్రజల సమస్యలను సీరియస్ గా తీసుకోవాలని, వచ్చిన అర్జీలను నిర్ణీత గడువులోపు నాణ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో భాగంగా కలెక్టర్ ప్రజల నుండి వినతులను స్వీకరించారు. ఫిర్యాదుల స్వీకరణ అనంతరం అధికారులతో సమీక్షించారు.. ప్రజల సంతృప్త స్థాయిలు పెరిగేలా అర్జీల పరిష్కారం ఉండాలని ఆదేశించారు. అర్జీలను పరిష్కరించే సమయంలో అర్జీ దారునితో వ్యక్తిగతంగా మాట్లాడితే నాణ్యతగా పరిష్కారం ఉంటుందని సూచించారు. పిజిఆర్ఎస్ లాగిన్‌లో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు చూడాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పిజిఆర్ఎస్ లాగిన్‌లో పరిష్కారం చేసిన అర్జీల నాణ్యతను ఆడిట్ చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, స్పెషల్ డిప్యూటి కలెక్టర్ వెంకటేశ్వర్లు, హౌసింగ్ పిడి చిరంజీవి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా పింఛన్ల పంపిణీ

2,39, లక్షల మందికి రూ.103.88 కోట్లు అందజేత

ఈనెలలో జిల్లాలో అర్హులైన 2,39256 మంది పింఛన్ లబ్దిదారులకు రూ.103.88 కోట్లు అందజేసినట్లు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. సోమవారం ఎన్టీఆర్ భరోసా పంపిణీలో ఖండేరి వీధిలోకలెక్టర్ పింఛన్లను అందజేశారు... ఈ సందర్భంగా కలెక్టర్ వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తనకు అంగవైకల్యం ఉందని పింఛన్ శాంక్షన్ చేయించాలని ఒక మహిళ కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఆమె దరఖాస్తు తీసుకొని తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సచివాలయం సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ, డిఆర్‌డిఎ పిడి రమణారెడ్డి, కర్నూలు అర్బన్ తహశీల్దార్ రవి, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లను పంపిణీ చేస్తున్న కలెక్టర్ రంజిత్ బాష

బిఎస్ఎన్ఎల్ ఫ్రీడం ప్లాన్ ఆఫర్ 15 వరకు పొడిగింపు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

బిఎస్ఎన్ఎల్ ఆగస్టులో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రవేశపెట్టిన ఫ్రీడమ్ ప్లాన్ గడువును సెప్టెంబర్15 వరకు పొడిగించిందని కర్నూలు బిజినెస్ ఏరియా ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ జి రమేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫ్రీడమ్ ప్లాన్ లేదా ఆజాది కా ఆఫర్ ద్వారా వినియోగదారులకు ఉచితంగా 4జిసిమ్‌ను ఇస్తూ కేవలం రూ .1 రీచార్జ్ ద్వారా 30 రోజులపాటు ప్రతిరోజు 2 జిబి డేటా, అపరిమితమైన వాయిస్ కాల్స్ , 100 ఎస్ఎంఎస్‌లు పొందవచ్చని ఈ ఆఫర్ కొత్తగా సిమ్ తీసుకునే వారికి , బిఎస్ఎన్ఎల్ కు పోర్ట్ అయ్యే వారికి వర్తిస్తుందని తెలిపారు. గత నెలలో ప్రవేశపెట్టిన ఈ ఆఫర్ ఆగస్టు 1నుండి ఆగస్టు 31 వరకు ఉండేదని , వినియోగదారుల నుండి వస్తున్న అధిక డిమాండ్‌కు అనుగుణంగా ఈ గడువును ఈనెల15 వరకు పొడిగించామన్నారు. వినియోగదారులు దగ్గర్లో ఉన్న బిఎస్ఎన్ఎల్ వినియోగదారుల సేవా కేంద్రం లేదా రిటైలరును సందర్శించి ఈ ఆఫర్ ను పొందాలని ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ జి రమేష్ తెలిపారు.

వక్కెర వాగు బ్రిడ్జి పనులు చేపట్టాలి

-కలెక్టర్‌కు పిపిఎస్ఎస్ వినతి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కల్లూరు లోని వక్కెర వాగు బ్రిడ్జి శిథిలమైందని వెంటనే మరమ్మతు పనులను చేపట్టాలని పట్టణపౌర సంక్షేమసంఘం రాష్ట్ర నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి జిల్లా కలెక్టర్‌ను కోరారు. సోమవారం జిల్లా కలెక్టర్‌ను పిపిఎస్ఎస్ ఆధ్వర్యంలో శిథిలమైన వక్కెర వాగు , హంద్రీ నది బ్రిడ్జిలకు సంబంధించిన ఫోటోలను అందజేశారు. ఈ ఫోటోలను తిలకిస్తూ జిల్లా కలెక్టర్ ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ ప్రమాదం పొంచి ఉన్న వక్కెర బ్రిడ్జి, హంద్రీ బ్రిడ్జి క్రింద రోడ్డుపై నీళ్ల ప్రవహించడం పై చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. బ్రిడ్జి కింద గోడలే కనిపించడం లేదంటూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ.. వెంటనే చర్యలు తీసుకోవాలని ఆర్అండ్‌బి ఎస్ఇని కలెక్టర్ ఆదేశించారు. ఆనంద్ టాకీస్ దగ్గర హంద్రీబ్రిడ్జి కింద రోడ్డుపై ప్రవహిస్తున్న నీళ్లవల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, బళ్లారి చౌరస్తా ఆంజనేయ స్వామి గుడి పక్కన, ఆటోనగర్ దగ్గర సర్వీసు రోడ్లపై పడ్డ గుంతల ఫోటోలను కలెక్టర్‌కు చూపించారు. నిమజ్జనం సందర్భంగా ఆర్‌టిసి బస్సులను కల్లూరు ఒక్కెర వాగు బ్రిడ్జి మీదుగా మళ్ళించడం వల్ల ప్రమాదం పొంచి ఉందని ఇరిగినేని పుల్లారెడ్డి తెలిపారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ ఆర్అండ్‌బి అధికారులు వెంటనే తగు చర్యలు చేపట్టేందుకు ఆదేశాలను జారీచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహమ్మద్ యూనుస్, సివి వర్మ ఎస్ అన్వర్ బాష ఉన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న పుల్లారెడ్డి

ఆటో కార్మికులకు నెలకు రూ.12 వేలివ్వాలి

- సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

స్త్రీశక్తి పథకం ద్వారా నష్టపోతున్న ఆటో కార్మికులకు నెలకు రూ.12,000 ఇవ్వాలని సిఐటియు ఓల్డ్ సిటీ ప్రధాన కార్యదర్శి విజయ రామాంజనేయులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఎపి ఆటో అండ్ ఫోర్ వీలర్ డ్రైవర్స్ యూనియన్ (సిఐటియు) ఓల్డ్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. యూనియన్ నగర అధ్యక్షులు డి.కుమార్ అధ్యక్షతన నిర్వహించిన నిరసనలో విజయ రామాంజనేయులు, నగర నాయకులు అబ్దుల్ దేశాయ్, నాగస్వాములు, రామకృష్ణ, యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి మహమూద్ మాట్లాడారు. కర్నూలు నగరంలో చదివిన చదువులకు ఉద్యోగ ఉపాధి అవకాశం దొరక్క చాలామంది నిరుద్యోగులు ఆటోల ద్వారా ఉపాధి పొందుతూ తమ కుటుంబాలను పోషించుకుంటున్నారన్నారు. బిజెపి ప్రభుత్వం అధికారంలో వచ్చినప్పటి నుండి ప్రభుత్వ సంస్థలను ప్రైవేటీకరిస్తూ ఉన్న ఉద్యోగాలను ఊడదీసి కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందన్నారు. రవాణా రంగంకుదేలై వాటిపై ఆధారపడి బతుకుతున్న కార్మికుల కుటుంబాలు చిన్నాభిన్న మయ్యాయన్నారు, కార్మికుల పైన పెట్రోల్ డీజిల్ రేట్లు, ఆర్టిఏ చలానా రేట్లు,ఇన్సూరెన్స్ ప్రీమియం రేట్లు, స్పేర్ పార్ట్స్ అధిక భారాలు, ప్రవేట్ ఫైనాన్సర్ల అధిక వడ్డీలు మోయరాన్ని భారంగా మారాయని గుర్తు చేశారు. ఇలాంటి పరిస్థితులలో ఆటో కార్మికులను ఆదుకోవాల్సిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వారికి ఉపాధి కోల్పోయేవిధంగా స్త్రీ శక్తి పథకం అమలకు పూనుకుందన్నారు. ప్రతి ఆటో డ్రైవర్ కు ప్రతినెల రూ.12,000 ఆర్థిక సాయం చేయాలని డిమాండ్ చేశారు. ఎటిసి సెంటర్లలో ప్రభుత్వం ఇచ్చిన చలాననే కాకుండా అదనంగా రూ.600 నుండి రూ.3500 వరకు వసూలు చేసి ఆటో కార్మికులను రవాణా కార్మికులను మోసం చేస్తున్నారన్నారు. తక్షణమే వాటిని రద్దు చేయాలన్నారు. ఆటో కార్మికులకు సంక్షేమబోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఆటో యూనియన్ ఆఫీస్ బేరర్స్ మద్దులేటి, త్యాగరాజు, గోపాలకృష్ణ, ఐజేవాస్, వెంగళరావు, వెంకటేష్, శ్రీను, నాగరాజు , ఆటో కార్మికులు పాల్గొన్నారు.

నిరసననుద్దేశించి మాట్లాడుతున్న నాయకులు

పూర్వ విద్యార్థులను అభినందిస్తున్న మువ్వాగోవిందు

విద్యార్థుల ప్రగతి ఉపాధ్యాయులకు గౌరవం

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్ : విద్యార్థులు ఉన్నత స్థితికి ఎదిగినప్పుడే ఉపాధ్యాయులకు అసలైన గౌరవమని డైట్ కళాశాల సోషల్ అండ్ సైన్సెస్ విభాగం అధిపతి, సీనియర్ అధ్యాపకులు మువ్వా గోవిందు అన్నారు. తమ కళాశాల నుంచి నూతనంగా వివిధ స్థానాల్లో స్థిరపడిన విద్యార్థులకు అభినందన కార్యక్రమాన్ని ఆయన ఆధ్వర్యంలో నిర్వహించారు. గోవిందు మాట్లాడుతూ.. 2015-17 బ్యాచ్ బ్యాచుకు చెందిన బి హరికృష్ణ ఇటీవల నిర్వహించిన డిఎస్‌సి ఫస్ట్ అటెమ్ప్ట్‌లోనే ఎస్‌జిటికి సోషల్‌స్కూల్‌అసిస్టెంట్ పోస్టులకు ఏకకాలంలో ఎంపికయ్యారన్నారు. సదరు విద్యార్థి హరికృష్ణ బిఎడ్ ఎంట్రన్స్ ఎడ్ సెట్ లో సోషల్ సైన్సులో స్టేట్ 29 వ ర్యాంకును, తెలంగాణ డిఎస్‌సి స్కూలు అసిస్టెంట్ సోషల్ విభాగంలో డిస్ట్రిక్ట్ 19వ ర్యాంక్‌ను గతంలో సాధించారన్నారు. ఎమ్మిగనూరు మండలంలోని తన స్వగ్రామం కోటేకల్లులో సోషల్ తొలి స్కూల్ అసిస్టెంట్‌గా గుర్తింపు పొందారన్నారు.అదే బ్యాచుకు చెందిన విజయ్ దేశంలోనే ప్రతిష్టాత్మకమైన ముంబైలోని తాజ్‌హోటల్‌లో మార్కెటింగ్ మే నేజర్‌గా ఎంపికయ్యారన్నారు. విద్యార్థులు మరింత ఉన్నత స్థానాలను అధి రోహించాలని కాంక్షించారు. సీనియర్ అధ్యాపకులు మారుతి సురేష్, పలువురు అధ్యాపకులు సిబ్బంది ఉపాధ్యాయ శిక్షకులు పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి హత్య

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్ : కర్నూలు నగరంలో సోమవారం వేర్వేరు ఘటనల్లో రెండు హత్యలు జరిగాయి. స్థానికుల వివరాల మేరకు ... సాయంత్రం బంగారు షాపులో పని చేసే వ్యక్తిని గుర్తు తెలియని దుండగులు హత్య చేశారు. ఈ ఘటనతో పాతబస్తీ వన్ టౌన్ ఒకసారిగా ఉలిక్కిపడింది. సుమారు సాయంత్రం 7 గంటల సమయంలో రాధాకృష్ణ థియేటర్ సమీపంలో ఉన్న మడిగల మసీదు వద్ద ఈఘటన జరిగింది. శరాఫ్ బజార్లోని 29వ నెంబరు బంగారు షాపులో పనిచేసే ఎన్ఆర్ పేట వాసి ఇశ్రార్ అహ్మద్ మసీదులో నమాజ్ ముగించుకొని బయటికి వస్తున్నారు. అంతకు ముందే బయట కాపుకాసి ఉన్న కొంతమంది వ్యక్తులు ఒక్కసారిగా కత్తులతో దాడి చేసి పరారయ్యారు. బాధితుడి చేతి హస్తం తెగి పడిపోయింది. స్థానికులు బాధితున్ని స్థానిక జిజిహెచ్‌కు తరలించారు. అక్కడ కోలుకోలేక మృతిచెందాడు. వన్ టౌన్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. వన్‌టౌన్ పోలీసులు కేసును దర్యాప్తు చేపట్టారు. మరిన్ని వివరాలు దర్యాప్తులో తేలనున్నాయి.

వద్ధురాలు దారుణ హత్య : కర్నూలు సాయి వైభవ్ నగర్‌లోకాటసాని శివలీల (75) ను అతికిరాతకంగా హత్యచేశారు. ఇంట్లో వద్ధురాలు ఒక్కరే ఉండడంతో గుర్తుతెలియని వ్యక్తులు తలపై బలంగా కొట్టి హత్య చేశారు. మృతురాలి అల్లుడు ఇంటికి వెళ్లి చూడగా హత్య గురయినట్లు గుర్తించారు. మతి రాలి మెడలో బంగారు గొలుసు, చేతికి ఉన్న నాలుగు బంగారు గాజులు తీసుకుని పోయినట్లు మతిరాలి కూతురు ఉమాదేవి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలాన్ని జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ సందర్శించారు. భాదిత కుటుంబ సభ్యులను పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి పరామర్శించారు. మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని ధర్యాప్తు చేస్తున్నారు.

3 దశాబ్ధాల దూరదృష్టి, అభివృద్ధి, సంక్షేమ యాత్ర

-ఎమ్మెల్సీ బిటి నాయుడు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

నేటితో కచ్చితంగా 30 యేళ్ల క్రితం (1995 సెప్టెంబర్ 1న) తొలిసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నారా చంద్రబాబు నాయుడు సేవలు, సంస్కరణలు, అభివృద్ధి కార్యక్రమాలు నేటికీ ప్రజలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని ఎమ్మెల్సీ బిటి.నాయుడు తెలిపారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు నాలుగు సార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన ఈ మూడు దశాబ్దాల కాలం, ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఒక మైలురాయని చెప్పారు. ప్రజల వద్దకు పాలన తీసుకెళ్లిన నాయకుడిగా, సంస్కరణలకు నాంది పలికిన దూరదృష్టి గల నేతగా ఆయన ఎల్లప్పుడూ గుర్తింపు పొందారన్నారు. ఆయన ప్రవేశపెట్టిన అనేక పథకాలు, కార్యక్రమాలు సమాజంలోని ప్రతి వర్గానికి చేరాయని అన్నారు. జన్మభూమి, క్లీన్ అండ్ గ్రీన్, దీపం, ఆదరణ, డ్వాక్రా వంటి కార్యక్రమాలు ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాయని చెప్పారు. మహిళలకు, బిసిలకు రిజర్వేషన్లు, మైనారిటీలకు ప్రత్యేక పథకాలు, ఎస్సీల కోసం పున్నయ్య కమిషన్ సిఫార్సుల అమలు, దళితుల వర్గీకరణ వంటి నిర్ణయాలు సామాజిక న్యాయానికి పునాది వేశాయన్నారు. రాష్ట్ర ఆర్థిక, పారిశ్రామిక, సాంకేతిక అభివృద్ధికి ఆయన చేసిన కృషి అమూల్యం అన్నారు. విద్యుత్ రంగ సంస్కరణలు, ప్రైవేట్ రంగంలో తొలి విమానాశ్రయం, టెలికాం రంగంలో కీలక సూచనలు, నేషనల్ హైవేలు, గ్రామీణ రహదారుల విస్తరణ ఇవన్నీ ఆయన విజనరీ లీడర్‌షిప్‌కు నిదర్శనమన్నారు. హైటెక్ సిటీ నిర్మాణం, విజన్ 2020, నాలెడ్జ్ ఎకానమీ ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను ఐటిమ్యాప్‌పై నిలిపారన్నారు. ప్రతి జిల్లాలో మెడికల్ కాలేజీలు, పెద్ద ఎత్తున ఇంజనీరింగ్ కాలేజీల స్థాపన, లక్షలాది మంది ఉపాధ్యాయుల నియామకం వంటి నిర్ణయాలు విద్యా, వైద్య రంగాలను విస్తృతంగా అభివృద్ధి చేశాయన్నారు. రైతుల కోసం తొలిసారి డ్రిప్ ఇరిగేషన్ టెక్నాలజీ, సాగునీటి ప్రాజెక్టులు, యాంత్రీకరణ, సబ్సిడీలతో అన్నదాతకు అండగా నిలిచారన్నారు. నదుల అనుసంధానం, పేదరిక నిర్మూలన కార్యక్రమాలు, అన్నా క్యాంటీన్లు, స్వచ్ఛభారత్, డిజిటల్ కరెన్సీ కమిటీ, రియల్ టైం గవర్నెన్స్, అమరావతి నిర్మాణం వంటి నిర్ణయాలు ఆయన ఆధునిక ఆలోచనలను ప్రతిబింబిస్తాయన్నారు. ఈ 30 యేళ్ల ప్రయాణం, అభివృద్ధి, సంక్షేమం, పారదర్శక పాలనల సమన్వయంతో నడిచిందని ఎమ్మెల్సీ బిటి.నాయుడు అన్నారు. "చంద్రబాబు చూపించిన దారిలోనే ఆధునిక ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందన్నారు. ఆయన సేవలు చరిత్రలో శాశ్వతంగా నిలుస్తాయని అన్నారు.

లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా సమరశీల పోరాటం

సిఐటియు న్యూసిటీ మహాసభ తీర్మానం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కార్మిక వర్గాన్ని కట్టు బానిసలుగా మార్చే లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పిఎస్.రాధాకృష్ణ, ఎండి. అంజిబాబు కోరారు. కర్నూలు నగర సిఐటియు న్యూ సిటీ కమిటీ మూడవ మహాసభ సోమవారం కార్మిక కర్షక భవన్‌లో ప్రారంభించారు. సిఐటియు పతాకాన్ని సిఐటియు జిల్లా నాయకులు ఎం.గోపాల్ ఆవిష్కరించారు. అనంతరం అమరవీరుల స్థూపానికి కార్మికులు శ్రద్ధాంజలి ఘటించారు. బి.రాధాకృష్ణ సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. మహాసభకు నగర ఉపాధ్యక్షులు కె.ప్రభాకర్ ,ఎస్ఎండి.రఫీ, నగర అధ్యక్షులు ఆర్.నరసింహులు అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. ముఖ్య అతిథులు సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎండి.అంజిబాబు, పిఎస్.రాధాకృష్ణ, శ్రామిక మహిళా కన్వీనర్ పి.నిర్మల మాట్లాడారు. నరేంద్ర మోడీ కార్మిక వర్గాన్ని బలి పశువులుగా చేయ డానికి బ్రిటిష్ కాలం నుంచి కొనసాగుతున్న కార్మిక చట్టాలన్నింటిని రద్దుచేసి 44 చట్టాలను కుదించి నాలుగు లేబర్ కోడ్ల పేరుతో హక్కులు హరించేరాని విమ ర్శించారు. బడా కార్పొరేట్ సంస్థల నాయకత్వంలో నడుస్తున్న బిజెపి ప్రభుత్వం బడా పెట్టుబడుదారులకు కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తుందన్నారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అంగన్వాడి ఆశ, మధ్యాహ్న భోజనం, ఆర్‌పిలు తదితర స్కీమ్ వర్కర్లపై విపరీతమైన పని భారం పెంచుతున్నారని, దానికి తగ్గ కనీస వేతనం ఇవ్వకుండా వేధిస్తున్నారని విమర్శించారు. హమాలీలకు సమగ్రమైన చట్టం అమలు చేయకుండా కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు శ్రమ దోపిడీ చేస్తున్నారని అన్నారు.

మహాసభలో మాట్లాడుతున్న సిఐటియు అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ

సభ ఆమోదించినతీర్మానాలు: కార్మిక వర్గాన్ని బలిపశువులుగా మార్చే లేబర్ కోడ్లను రద్దుచేసి పాత చట్టాలను అమలు చేయాలని, స్కీంవర్కర్లకు కనీస వేతనం రూ.26వేలు ఇచ్చి సంక్షేమ చట్టాలు వర్తింపజేయాలని, కార్మికులపై పని భారాన్ని తగ్గించాలని, కర్నూలు నగరంలో రోడ్డు సైడ్ చిన్న తోపుడు బండ్లు పెట్టుకొని జీవించే చిరువ్యాపారుల పొట్ట కొట్టే విధంగా కార్పొరేషన్ అధికారుల ప్రయత్నాలను విరమించి, అధికారులు ప్రభుత్వం సహకరించాలని, షాపింగ్ మాల్స్ ప్రైవేట్ హాస్పిటల్స్‌లలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలివ్వాలని, తీర్మానాలను మహాసభ ఏకగ్రీవంగా ఆమో దించింది. ఈ మహాసభ వేదికపై సిఐటియు నగర ఆఫీస్ బేరర్స్ సిహెచ్ సాయిబాబా, నర సింహులు, ఎం,గోపాల్,కె.ప్రభాకర్ బి.రా ధాకృష్ణ, కె. సుధాకరప్ప, జి.ఏసు, ఎం.వెంక టేశ్వర్లు ఎస్ఎండి. రఫీలు ఉన్నారు. న్యూ సిటీకమిటీ పరిధిలోని హమాలీలు, ఆటో కార్మికులు, అంగన్వాడీలు, ఆశా వర్కర్లు, ఆర్పీలు ప్రతినిధులుగా హాజరయ్యారు.

సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి రాష్ట్ర అధ్యక్షురాలు వరుదు కళ్యాణి

రాష్ట్రంలో మహిళా వ్యతిరేక పాలన

వైసిపి మహిళా విభాగం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

రాష్ట్రంలో మహిళా వ్యతిరేక పాలన సాగుతుందని వైసిపి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఎమ్మెల్సీలు వరుదు కళ్యాణి, కల్పలతారెడ్డి, వైసిపి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్‌వి విజయ మనోహరి మండిపడ్డారు. సోమవారం కర్నూలు నగరంలోని ఎస్‌వి కాంప్లెక్స్‌లో ఐదు జిల్లాల మహిళా అధ్యక్షురాల్లు, ప్రజా ప్రతినిధులతో వారు సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనలో మహిళా సాధికారత పాలన సాగితే, బాబు హయంలో మద్యం సాధికారత పాలన నడిస్తుందని విమర్శించారు. మహిళలకు అన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తామని, నిరుద్యోగ భృతితోపాటు ఆడబిడ్డ నిదిని అందిస్తామని చెప్పి చంద్రబాబు పంగనామాలు పెట్టారని అన్నారు. రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైందన్నారు. మద్యం ఏరులై పారుతూ గ్రామ గ్రామాన బెల్టు షాపులతో మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చారన్నారు. మహిళ సాధికారత పాలన రావాలంటే మహిళలు చైతన్యం కావాలని, రానున్న ఎన్నికలల్లో వైసిపి బలోపేతానికి కృషి చేసి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని సిఎంనుచేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి మహిళలు పాల్గొన్నారు.

క్లస్టర్ యూనివర్సిటీ అభివృద్ధికి పాటుపడాలి

విసి వి. వెంకట బసవరావు

ప్రజాశక్తి-కర్నూలుకలెక్టరేట్ : క్లస్టరు యూనివర్సిటీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని క్లస్టర్ యూనివర్సిటీ విసి ఆచార్య వి. వెంకట బసవరావు పేర్కొన్నారు. సోమవారం క్లస్టర్ వర్సిటీ అకాడమిక్, అడ్మినిస్ట్రేటివ్ సమా వేశం నిర్వహించారు. రిజిస్ట్రార్ డాక్టర్ జి. శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. విసి వి.వెంకట బసవరావు మాట్లాడుతూ కళాశాలలకు అటాన మస్ హోదా సాధన కోసం తీసుకోవాల్సిన వ్యూహాలపై సిబ్బందికి సమగ్రంగా సూచనలు ఇచ్చారు. న్యాక్ అక్రిడియేషన్ కోసం అనుసరించాల్సిన నూతన ప్రక్రియలు, క్రీడల అభివృద్ధి, ఇంటర్నల్ క్వాలిటీ అశ్యూరెన్స్‌సెల్ విస్తరణ, త్వరలోనే స్థాపించనున్న ఇంక్యూబేషన్ సెంటర్ గురించి వివరించారు. విద్యార్థుల్లో పరిశోధనా నైపుణ్యాలను పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. పర్మెన్ డిగ్రీకళాశాల ప్రిన్సిపల్స్ డాక్టర్ ఎం.ఇందిర శాంతి, డాక్టర్ కె.వెంకటరెడ్డి, వైస్ ప్రిన్సిపల్స్ బిఆర్ ప్రసాద్ రెడ్డి, రంగారెడ్డి, డీన్స్ అక్తర్ భాను, మహమ్మద్ వాహీజ్, నాగరాజ్ శెట్టి, కంట్రోల్ ఆఫ్ ఎగ్జామి నేషన్స్ బాలసుబ్రమణ్యం, ఫామిద, వింధ్యావాహిని,మూడు కళాశాలల బోధనా సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న విసి వెంకటబసవరావు

సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును పటిష్ట పరుస్తాం

- ఎమ్మెల్సీ బిటి

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని ప్రజలకు భవిష్యత్తులో తాగునీటి ఎద్దడి రాకుండా సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును పటిష్ట పరిచి నీటి నిల్వకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్సీ, ఆదోని మున్సిపల్ ఎక్స్ అఫీషియో సభ్యులు బిటి.నాయుడు తెలిపారు. సోమవారం మున్సిపల్ చైర్మన్ లోకేశ్వరి, కమిషనర్ కృష్ణతో కలిసి సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బసాపురం ఎస్ఎస్ ట్యాంకు మరమ్మతుల కోసం యుద్ధ ప్రాతిపదికన నిధుల విడుదలకు ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రులను కలుస్తామన్నారు. ఆదోని ప్రజల దాహార్తిని తీర్చే ట్యాంకు శిథిలావస్థకు చేరడం చూస్తుంటే రాబోయే వేసవిలో నీటి ఎద్దడి తలెత్తే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకెళ్లి నిధులు విడుదల చేయించేలా కృషి చేస్తామని చెప్పారు. మరమ్మతుల కోసం రూ.70 నుంచి రూ.90 కోట్లు అవసరం ఉందని అధికారులు ప్రతిపాదనలు పెట్టారని, బసాపురం ఎస్ఎస్ ట్యాంకు పరిస్థితి గురించి జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకెళ్లి ట్యాంకు పరిశీలనకు పిలుస్తానని తెలిపారు. ఆదోనిలో నీటి సమస్య తలెత్తకుండా కృషి చేసి నిధులు తెచ్చి శాశ్వత పరిష్కారం చూపుతామని చెప్పారు. డిప్యూటీ ఇంజినీర్ రామ్మూర్తి, చలపతి, నాయకులు నాగరాజు స్వామి, కుమారస్వామి, గోపి ఉన్నారు.

సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ బిటి

10న ఐలమ్మ, రామకృష్ణ వర్ధంతి సభ

- రజక వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గురుశేఖర్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఈనెల 10న ఐలమ్మ, రామకృష్ణ వర్ధంతి సభను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సి.గురు శేఖర్ కోరారు. సోమవారం పట్టణంలోని శివ సర్కిల్, కెడిసిసి బ్యాంకు కార్యాలయంలో రజక వృత్తిదారుల సమావేశం నిర్వహించారు. పట్టణ కార్యదర్శి సి.ఈరన్న అధ్యక్షత వహించారు. ముందుగా వర్ధంతి సభ కరపత్రాలను ఆవిష్కరించారు. సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు సి.హనుమంతు, గురుశేఖర్ మాట్లాడుతూ... పట్టణంలోని పద్మశాలి కళ్యాణ మండపంలో 10 గంటలకు వర్ధంతి సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కమిటీ సభ్యులు రామన్న, ఉరుకుందు, రంగస్వామి, గోపాల్, మహేష్, రమేష్, పట్టణ అధ్యక్షులు జలాలి, నాయకులు రంగన్న, సీనియర్ నాయకులు ఆదోని ఈరన్న, మల్లప్ప, నందవరం మండల నాయకులు ఎల్లప్ప, రామకృష్ణ, ఎమ్మిగనూరు మండల నాయకులు నాగరాజు, వెంకటేష్, ఎస్ఎఫ్ఐ మండల నాయకులు రాము పాల్గొన్నారు.

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం

- ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు ఒక వరమని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి తెలిపారు. సోమవారం ఎమ్మిగనూరులో వివిధ మండలాలకు చెందిన అరుగురు బాధితులకు ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.6.97 లక్షల విలువ గల సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఎమ్మిగనూరు మండలం బి.సల్లకూడురుకు చెందిన మానసకు రూ.61,572, కడివెళ్లకు చెందిన ఖాదర్ బాషా కుటుంబానికి రూ.40,350, చిన్న కూమెల వీధికి చెందిన మహ్మద్ గౌస్‌కు రూ.94,390, ఎమ్మిగనూరుకు చెందిన ఫయాజ్ అహ్మద్‌కు రూ.41,045, ఉదయ్‌కుమార్ కుటుంబానికి రూ.40 వేలు, నందవరం మండలం పూలచింతకు చెందిన నాగభూషణంకు రూ.60 వేల చెక్కులు అందజేశారు.

చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే బీవీ

డ్రైవర్ల సంక్షేమానికి సహకరిస్తాం : సిఐ

ప్రజాశక్తి - గోనెగండ్ల

మండలంలోని వాహనాల డ్రైవర్ల సంక్షేమానికి పోలీసు శాఖ తరఫున సహకరిస్తామని సిఐ విజయ భాస్కర్ తెలిపారు. సోమవారం గోనెగండ్ల బస్టాండ్ ఆవరణలో సేఫ్ డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డ్రైవర్స్ డే నిర్వహించారు. ముఖ్య అతిథిగా సిఐ విజయ భాస్కర్, స్థానిక డ్రైవర్స్ అసోసియేషన్ నాయకులు, డ్రైవర్లతో కలిసి కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకున్నారు. ఆయన మాట్లాడుతూ... నాయకులు కేవలం యూనియన్ వారికే కాకుండా గ్రామంలో వాహనదారులందరికీ రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనల పట్ల అవగాహన కల్పించాలన్నారు. లైసెన్స్ లేని డ్రైవర్లకు ఆదోని రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ ద్వారా లైసెన్సులు ఇప్పిస్తామని తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ ఎన్‌టి.కుమార్, డ్రైవర్ల యూనియన్ నాయకులు బుట్టా ప్రకాష్, ఖాజా, ఖాద్రీ, దండు వలీ, మస్తాన్ వలీ, గజేంద్ర, చంద్రశేఖర్, మోసిన్ బాష పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల విజృంభణ

- జ్వరాల బారిన పడుతున్న గ్రామస్తులు
- అప్రమత్తంగా ఉండాలి
- వైద్యాధికారిణి రేవతి

ప్రజాశక్తి - నందవరం

ఎడతెరపి లేని వర్షాలతో ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. రోగులతో ఆస్పత్రి కితకిట లాడుతోంది. సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు...

గత నెల రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. జలుబు, తలనొప్పి, ఒళ్లు నొప్పులు, దగ్గుతో అవస్థలు పడుతున్నారు. నిరంతరం వర్షం కురవడం వల్ల ప్రజలు బయటికి వెళ్లలేని విధంగా ఉంది. ముసురు మూసుకోవడం వల్ల చల్లటి వాతావరణానికి దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న వ్యక్తులు, చిన్నపిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వివిధ రకాల వ్యాధులతో రోజూ సుమారు 100 మంది ఆస్పత్రికి వస్తున్నారని వైద్యాధికారులు చెబుతున్నారు. సాధారణ సమయంలో రోజూ ఒపిలు 30 నుంచి 40 వరకు వచ్చేవి. వర్షాకాలం కావడంతో వైరల్ ఫీవర్‌తో ప్రజలు ఎక్కువ సంఖ్యలో ఆస్పత్రికి వస్తున్నారు. వచ్చిన ప్రతి ఒక్కరికీ వైద్యసేవలు అందిస్తున్నామని వైద్యులు పేర్కొంటున్నారు. ప్రజల ఆరోగ్యం దృష్ట్యా మండలంలోని గ్రామాల్లో ఉన్న హెల్త్ వెల్నెస్ సెంటర్లలో ఎంఎల్‌ఎంపి, ఎఎన్ఎం, ఆశా కార్యకర్త అందుబాటులో ఉంటారని, అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచామని వైద్యాధికారులు చెబుతున్నారు. అనారోగ్యాల బారిన పడిన వారు గ్రామాల్లోని క్లినిక్‌కు వెళ్లి ప్రథమ చికిత్స తీసుకోవాలని సూచించారు. మురుగునీరు నిల్వ లేకుండా, స్ప్రే చేస్తూ ఆరోగ్యవంతమైన గ్రామంగా తీర్చిదిద్దడంలో తమ వంతు కృషి చేస్తున్నామని పంచాయతీ అధికారులు చెబుతున్నారు.

రోగులతో కిటకిటలాడుతున్న ఆస్పత్రి

అప్రమత్తంగా ఉండాలి : వైద్యాధికారిణి రేవతి

సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. జ్వరం, జలుబు, దగ్గు వస్తే నిర్లక్ష్యం చేయకుండా ఆస్పత్రిని సందర్శించి ట్రీట్‌మెంట్ తీసుకోవాలి. వర్షంలో ఎక్కువ సేపు తడవకుండా జాగ్రత్త తీసుకోవాలి. వర్షాకాలం కావడంతో వచ్చిన కొత్త నీటిలో మలేరియా, డెంగీ కారక దోమలు ఉంటాయి. ఆ నీటిని కాచి చల్లార్చి తాగాలి. చిన్నపిల్లల పట్ల తల్లిదండ్రులు మరింత జాగ్రత్త వహించాలి. వసతి గృహాల్లో ఉండే విద్యార్థులు చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రజలు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. వాటర్ ట్యాంకుల్లో నీరు ఎక్కువ రోజులు నిల్వ ఉంచుకోరాదు. ప్రజలు దోమతెరలు, మస్కిటో కాయిల్స్ వాడి అనారోగ్యం బారిన పడకుండా జాగ్రత్త తీసుకోవాలి.

ఉల్లికి రూ.3 వేల ధర కల్పించాలి

- రైతుసంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశులు

ప్రజాశక్తి - ఆదోని రూరల్

ఉల్లికి క్వింటా రూ.3 వేల ధర ఇవ్వాలని, ఎకరాకు రూ.50 వేల నష్టపరిహారం ఇవ్వాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశులు కోరారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతిపత్రం అందజేశారు. వెంకటేశులు, రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.మల్లయ్య, నాయకులు కోసిగి వీరేష్, రాముడు, పెద్దకడబూరు తిక్కన్న మాట్లాడారు. ఆదోని, కోసిగి, పెద్దకడబూరు, కౌతాళం రైతులు ఉల్లి పంటను తమిళనాడు రాష్ట్రం చెన్నైకి తీసుకెళ్లి అమ్ముకుంటున్నారని తెలిపారు. అక్కడా ధర పూర్తిగా తగ్గిపోయిందని, క్వింటా రూ.500 కూడా రావడం లేదని చెప్పారు. కొంతమంది రైతులు పంటను అక్కడే వదిలేసి వచ్చారని, అలాగే పొలాల్లోనే చాలామంది రైతులు పంటను వదిలేశారని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలోనూ ఉల్లి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి ప్రభుత్వమే క్వింటా రూ.3 వేల ప్రకారం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉల్లి రైతులను ఆదుకోవాలి

- సిపిఎం జిల్లా నాయకులు వీరశేఖర్

ప్రజాశక్తి - దేవనకొండ

ఉల్లి రైతుకు గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వం ఆదుకోవాలని, దేవనకొండలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని సిపిఎం జిల్లా నాయకులు బి.వీరశేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో ఎఒ కార్యాలయం ముందు నిరసన చేపట్టి, ఎఒ ఉషారాణికి వినతిపత్రం అందజేశారు. సిపిఎం మండల కమిటీ సభ్యులు యూసుఫ్ బాష అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వీరశేఖర్ మాట్లాడారు. మండలంలో హంద్రీ పరివాహక ప్రాంతం, బోరుబావుల కింద నల్ల రేగడి పొలాల్లోనూ ఉల్లిని విస్తారంగా సాగు చేశారని, పంట చేతికొచ్చి మార్కెట్‌కు తీసుకెళ్తే క్వింటా రూ.400తో కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. ఎకరాకు రూ.60 నుంచి రూ.70 వేల పెట్టుబడులు పెట్టి మార్కెట్‌కు తీసుకెళ్తే అరకొర ధరతో వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం జోక్యం చేసుకొని ఉల్లి పండుతున్న ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. క్వింటాకు రూ.1,200 ధర నిర్ణయించిందని, కింటాకు రూ.2 వేలు నిర్ణయించాలని కోరారు. సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు మహేంద్ర, నాగేంద్ర, రాయుడు, శ్రీనివాసులు, రంగన్న, వెంకటేశులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి రోప్ స్కిప్పింగ్‌కు చిప్పగిరి విద్యార్థి

ప్రజాశక్తి - చిప్పగిరి

డోన్ పట్టణంలో ఆదివారం జరిగిన రాష్ట్రస్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచి చిప్పగిరి విజయ విఠల ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థి ధనుష్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ కిష్టపాడు యూసుఫ్, చంద్రమోహన్ తెలిపారు. సోమవారం వారు మాట్లాడారు. జిల్లాస్థాయికి గతవారంలో జరిగిన రోప్ స్కిప్పింగ్ పోటీల్లో పాల్గొని విజయం సాధించి రాష్ట్రస్థాయికి ఐదుగురు ఎంపికయ్యారని, ఆదివారం జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఒక విద్యార్థి విజయం సాధించి గుజరాత్‌లో జరిగే జాతీయస్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. చిప్పగిరి గ్రామం నుంచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం గర్వించదగ్గ విషయమన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసి వారిని భావితరాలకు పరిచయం చేయడంతో పాటు క్రీడల్లోనూ, చదువులోనూ ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు. చిప్పగిరి నుంచి ఐదుగురు రాష్ట్రస్థాయికి ఎంపిక కాగా, ఒకరు మాత్రమే జాతీయ స్థాయికి ఎంపికయ్యారన్నారు. విద్యార్థులకు విజయ విఠల ఇంగ్లీష్ మీడియం స్కూల్ ముందు క్రీడా సర్టిఫికెట్లను ఉపాధ్యాయులతో కలిసి అందజేసినట్లు తెలిపారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన ధనుష్‌కు ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు.

సర్టిఫికెట్లు పొందిన విజయ విఠల విద్యార్థులు

ధనుష్

'వారసత్వ భూములకు పట్టాలివ్వాలి'

ప్రజాశక్తి - మంత్రాలయం

వారసత్వ భూములకు పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వాలని రైతులు సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌ను కోరారు. సోమవారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాధితులు కామాటి రాఘన్న, గనేకంటి సున్నం రఘు మాట్లాడారు. కొందరు రెవెన్యూ అధికారుల నిర్వాకం వల్ల అనుభవంలో ఉన్న భూములకు ఇంత వరకు పాసు పుస్తకాలు ఇవ్వడం లేదని తెలిపారు. 1970లో రెడ్లు, కరణాల పాలనలో రైతులైన తమ పెద్దలకు ఎలాంటి నోటీసులూ ఇవ్వకుండా భూ సర్వే చేసి ఎఫ్ఎల్ఆర్‌ను తయారు చేశారని తెలిపారు. అధికారులు రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఎంపిటిసి బోయ మేకల వెంకటేష్, మాజీ ఎంపిటిసి వీరేష్, పేగుల తిమ్మయ్య, గురురాజ పాల్గొన్నారు.

గ్రూపు విభేదాలకు తావివ్వకుండా అభివృద్ధి

- ఎంపీ బస్తిపాటి నాగరాజు

ప్రజాశక్తి- దేవనకొండ

మండలంలో నాయకులు, కార్యకర్తలు గ్రూపు విభేదాలకు తావివ్వకుండా కలిసికట్టుగా సమస్యలను తమ దృష్టికి తీసుకొచ్చి అభివృద్ధి చేసుకోవాలని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు తెలిపారు. సోమవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరయి దేవనకొండ బిల్డింగ్ కాలనీలో పింఛన్లు పంపిణీ చేశారు. పంచాయతీ కార్యాలయ సమీపంలోని ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలూరు నియోజవర్గంపై ప్రత్యేక దృష్టి పెట్టారని, అందువల్లే ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, రాయలసీమ ఆర్‌టిసి ఛైర్మన్ పూల నాగరాజు, తనతో కలిపి త్రి సభ్య కమిటీ ఏర్పాటు చేశారని తెలిపారు. సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. గత 30 ఏళ్ల చరిత్రలో నియోజకవర్గంలో టిడిపి జెండాను ఎగుర వేయలేదని, వచ్చే ఎన్నికల్లో టిడిపి జెండా ఎగురవేద్దామని తెలిపారు. నియోజకవర్గంలో వేదవతి ప్రాజెక్టు నిర్మాణానికి త్వరలో నిధులు విడుదలవుతాయని, హంద్రీనీవా పిల్ల కాలువల నిర్మాణాలకు రూ.210 కోట్లు ప్రతిపాదనలు పంపామని చెప్పారు. నిధులు మంజూరైన వెంటనే పనులు పూర్తి చేసి 50 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామన్నారు. టిడిపి మండల కన్వీనర్ విజయ భాస్కర్ గౌడ్, మాజీ ఎంపిపి రామచంద్ర నాయుడు, టిడిపి నాయకులు ఉచ్చీరప్ప, కప్పట్రాళ్ల మల్లికార్జున, బడిగింజల రంగన్న, ఆకుల వీరేష్, రామారావు నాయుడు, మల్లయ్య, రాజశేఖర్ గౌడ్, మల్లికార్జున గౌడ్, కాకర్ల శాంతి కుమార్, నాగరాజ్ గౌడ్, రాజాసాబ్, తెర్నేకల్ చిన్న వెంకప్ప, బాటమీది రాజు, వెలమకూరు, గుడిమిరాళ్ల, చెల్లెల చలమల సర్పంచులు భాస్కర్, చిన్న రామప్ప, శేషిరెడ్డి, కూటమి నాయకులు కటిక ఉచ్చీరప్ప రవి, రామాంజనేయులు, బాలకృష్ణ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ నాగరాజు

చిన్నారుల కుటుంబాలను ఆదుకోవాలి : ఎంపిటిసి

ప్రజాశక్తి - ఆస్పరి

మండలంలోని చిగిలి గ్రామంలో నీటి కుంటలో పడి మృతి చెందిన ఆరుగురు చిన్నారుల కుటుంబాలను ఆదుకోవాలని సర్పంచి జయమ్మ, ఎంపిటిసి రాధాకృష్ణ కోరారు. సోమవారం కలెక్టర్ రంజిత్ బాషకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ... చిన్నారులు మృతి చెందిన రోజు డిఇఒ శామ్యూల్ పాల్ బాధిత కుటుంబాలను పరామర్శించారని, ప్రభుత్వంతో మాట్లాడి బాధిత కుటుంబాలకు రూ.5 లక్షలు పరిహారం అందేలా చూస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. పరిహారంతో పాటు పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మించాలని కోరారు. స్పందించిన కలెక్టర్ ప్రహరీ నిర్మాణం వెంటనే చేపట్టాలని పిఆర్ డిపార్ట్‌మెంట్ అధికారులకు ఆదేశాలిచ్చారు.

4న దరఖాస్తుల పరిశీలన

- డిప్యూటీ కమిషనర్ వాణి

ప్రజాశక్తి - కౌతాళం

శ్రీలక్ష్మీ నరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి దేవదాయ ధర్మకర్త మండలి నియామకానికి దరఖాస్తు చేసుకున్న వారి పత్రాలను ఈనెల 4న పరిశీలిస్తున్నట్లు దేవాలయ డిప్యూటీ కమిషనర్ వాణి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడారు. దరఖాస్తుదారులు ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, పోలీస్ ఎంక్వయిరీ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రం, సెల్ఫ్ అఫిడవిట్ పత్రాలతో గురువారం దేవస్థానం కార్యాలయంలో హాజరుకావాలని పేర్కొన్నారు.

చర్చి నిర్మాణానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి-ఆలూరు

ఆలూరు మండలం ముద్దనగేరి గ్రామంలో మోక్షరాగ్ని చర్చి నిర్మాణం కోసం తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి సి.నారాయణ రెడ్డి, ఆయన సోదరుడు శ్రీనివాస రెడ్డిలు సోమవారం రూ.50 వేల చెక్కును చర్చి పెద్దలకు అందించారు. గ్రామాభివృద్ధికి తనవంతు కృషి చేస్తామని వారు తెలిపారు. చర్చి కమిటీ సభ్యులు ఆరోగ్య స్వామి, అబ్రహాం, దావీదు, థామస్, ఆంథోనిలు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉద్యోగ, ఉపాధ్యాయులకు పింఛను భద్రత కావాలి

- ఆంధ్రప్రదేశ్ పురపాలక ఉపాధ్యాయ సమాఖ్య

ప్రజాశక్తి - ఆదోని

ఉద్యోగ, ఉపాధ్యాయులకు పింఛను భద్రత కల్పించాలని ఆంధ్రప్రదేశ్ పురపాలక ఉపాధ్యాయ సమాఖ్య నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. విరామ సమయంలో మున్సిపల్ ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. సమాఖ్య జిల్లా కార్యదర్శి సురేష్ కుమార్, పట్టణ శాఖ అధ్యక్షులు అనిల్ కుమార్, ప్రధాన కార్యదర్శి జంగం బసవరాజు మాట్లాడారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ కింద పనిచేస్తూ ఇటీవల విరమణ పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం అందించే సామాజిక పెన్షన్ కంటే తక్కువ పొందుతున్నారని తెలిపారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు కోటన్న, చంద్రమౌళి, ప్రతాప్ రెడ్డి, ఎల్లాగి, భాస్కర్, గుర్రప్ప, రాముడు, గఫార్, నాగేశ్వర నాయుడు, హేమలత, హర్షియా, సునంద, హర్షా శిల్ప, శకుంతల, పద్మా బాయి, కల్యాణి, రూహుల్ అమీన్, రసూల్ బీ, ఇమ్రాన్, పార్థసారథి ఉన్నారు.

సిసి రోడ్లు నిర్మించాలి

- కాలనీ వాసుల వినతి

ప్రజాశక్తి - హాలహర్వి

హాలహర్వి ఎస్సీ కాలనీలో సిసి రోడ్లు నిర్మించాలని కాలనీ వాసులు కోరారు. సోమవారం తహశీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపిడిఒ వరలక్ష్మికి వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ... వర్షం కురిస్తే కాలనీలో రెండు అడుగుల మేర నీరు నిలిచి చెరువును తలపిస్తోందని తెలిపారు. డ్రెయినేజీలు లేకపోవడంతో రోడ్డుపై నీళ్లు నిల్వ ఉంటోందని, ప్రజలు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. వీధి దీపాలు కూడా వెలగడం లేదని తెలిపారు.

నేడు రాష్ట్రస్థాయి భజన పోటీలు : సర్పంచి లక్ష్మీ

ప్రజాశక్తి - ఆస్పరి

మండలంలోని కారుమంచి గ్రామంలో వెలసిన శ్రీదక్షిణ మూర్తి 33వ ఆరాధనోత్సవాల్లో భాగంగా మంగళవారం రాష్ట్రస్థాయి భజన పోటీలు నిర్వహిస్తున్నట్లు సర్పంచి లక్ష్మీ, గ్రామ పెద్దలు తెలిపారు. సోమవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. భజన పోటీల్లో గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ.15,116, రెండో బహుమతి రూ.12,116, మూడో బహుమతి రూ.9,116, నాలుగో బహుమతి రూ.7,116, ఐదో బహుమతి రూ.6,116, ఆరో బహుమతి రూ.4,516, ఏడో బహుమతి రూ.4,116, ఎనిమిదో బహుమతి రూ.3,116 ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ప్రవేశ రుసుం రూ.300 చెల్లించి పేరు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 8074939046, 9491343451 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని కోరారు.

'సమయానికి బస్సు నడపాలి'

ప్రజాశక్తి - హోళగుంద

ఆలూరు, సులువాయి మీదుగా హోళగుందకు వస్తున్న బస్సు పాఠశాలలు, కళాశాలల సమయానికి అనుగుణంగా నడపాలని విద్యార్థులు కోరారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహశీల్దార్ నిజాముద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. విద్యార్థులు మాట్లాడుతూ... విరుపాపురం, సులువాయి, సమ్మతగేరి, పెద్దహ్యాట గ్రామాల విద్యార్థులు పాఠశాల, కళాశాలలకు ఆలస్యంగా వెళ్తున్నారని తెలిపారు. రోజూ తమకు ఆబ్సెంట్ పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్‌టిసి అధికారులు స్పందించి సమయానికి అనుకూలంగా బస్సు నడపాలని కోరారు.

దేశ ఆర్థిక ప్రతిబింబం.. ఎల్ఐసి

- ఘనంగా ఎల్ఐసి 69వ వారోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

భారత దేశ ఆర్థిక ప్రతిబింబం ఎల్ఐసి అని వక్తలు తెలిపారు. సోమవారం ఎల్ఐసి బ్రాంచి కార్యాలయంలో ఎల్ఐసి 69వ వారోత్సవాలు ప్రారంభించారు. ముఖ్య అతిథి శిరీష, బ్రాంచి సిబ్బంది జ్యోతి ప్రజ్వల చేసి కేక్ కట్ చేశారు. కెనరా బ్యాంకు-2 బ్రాంచి మేనేజర్ శిరీష, ఎల్ఐసి బ్రాంచి మేనేజర్ పులి నాయక్, డిఒ అసోసియేషన్ కడప డివిజన్ అధ్యక్షులు పాటిల్ తిమ్మారెడ్డి, అసిస్టెంట్ బ్రాంచి మేనేజర్ సంతోష్ కుమార్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు ఇందిర, ప్రతాప్ కుమార్, క్లాస్ త్రీ ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకులు విజయ్ కుమార్, లియాఫీ బ్రాంచి కార్యదర్శి జయన్న, క్లియ నాయకులు అనంతభూరళి, రంగస్వామి మాట్లాడుతూ... ప్రపంచంలోనే ఇన్స్యూరెన్స్‌లో ఎల్ఐసి మూడో స్థానంలో ఉందని తెలిపారు. ఎల్ఐసి ప్రజల డబ్బుతో.. ప్రజల సంక్షేమమనే నినాదంతో ముందుకు సాగుతోందని చెప్పారు. జులై 15న ఎమ్మిగనూరు బ్రాంచి దేశంలో ఒకేరోజు 500 పైగా పాలసీలు ఇవ్వడం ఆనందదాయకమని తెలిపారు. ఎల్ఐసిలో పాలసీదారుడు పెట్టే ప్రతి పైసా కుటుంబ సంక్షేమానికి ఉపయోగపడడంతో పాటు దేశ సంక్షేమానికి కూడా ఉపయోగపడుతుందని చెప్పారు. దేశంలో క్లెయిమ్‌ల పరిష్కారంలో ఎల్ఐసి అగ్రగామిగా నిలిచిందని, 99 శాతానికి పైగానే పరిష్కారమయ్యాయని తెలిపారు. ఎల్ఐసి ఎదుగుదలలో ఏజెంట్లు కృషి ఉందన్నారు. వారోత్సవాల సందర్భంగా బ్రాంచిలో మొదటి ప్రీమియం చెల్లించిన బి.వెంకటరమణకు శాలువా, పూలమాల, బహుమతి అందించి సన్మానించారు. ఎల్ఐసి డెవలప్‌మెంట్ ఆఫీసర్లు మధుసూదన్, వీరాంజనేయులు, నాగ లింగయ్య, రామకృష్ణ, ఎల్ఐసి సిబ్బంది రఘునాథ్ గౌడ్, గోవర్ధన్, హంపయ్య, మురళీ, శంకర్, వెంకటేశ్వర్లు, వెంకటేష్, సురేష్, పరమేశ్వర్ రెడ్డి, శ్రీవాణి, లియాఫీ నాయకులు రమేష్, ఆంధ్రయ్య, హరినాథ్, వీరేష్, మల్లికార్జున గౌడ్, అబ్దుల్ గఫూర్, సూర్యకాంత్ రెడ్డి, రాజగోపాల్ శెట్టి, ప్రసాద్, నాగన్న పాల్గొన్నారు.

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎల్ఐసి సిబ్బంది, ముఖ్య అతిథి

ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యత

- ఎఒ శ్రీరామ్ ప్రవీణ్

ప్రజాశక్తి - చిప్పగిరి

వ్యవసాయ రంగంలో తక్కువ పెట్టుబడితో ఎక్కువ రాబడి పొందాలంటే ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతి రైతుకూ లాభదాయకంగా ఉంటుందని ఎఒ శ్రీరామ్ ప్రవీణ్ సూచించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసిన కూరగాయలను సోమవారం మండల కార్యాలయంలో పరిశీలించి మాట్లాడారు. ప్రకృతి సాగు ప్రతి రైతుకూ లాభదాయకంగా ఉంటుందన్నారు. ప్రకృతి సాగులో కూరగాయలు, ఆకుకూరలకు ప్రాధాన్యత ఇచ్చి సాగు చేస్తే నిత్యం రాబడి ఉంటుందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయంతో పండించిన ఆకుకూరలు, కూరగాయల్లో మంచి బలవర్ధకమైన ఆహారం లభిస్తుందన్నారు. మహిళలకు ఆకుకూరలు, కూరగాయల వల్ల రక్తహీనతకు తావు లేకుండా కాపాడుతుందని తెలిపారు. పరిపాలనాధికారి శ్రీనివాసులు, ఎపిఎం శివయ్య, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రేవన్న, రంగయ్య, రాజశేఖర్, ఝాన్సీ పాల్గొన్నారు.

చేనేతలను ఆదుకోవాలి

- చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రాజు

ప్రజాశక్తి - నందవరం

వర్షం కారణంగా నష్టపోయిన చేనేతలను ప్రభుత్వం ఆదుకోవాలని చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కె.రాజు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన నాగలదిన్నె గ్రామంలో పర్యటించారు. చేనేత కాలనీని సందర్శించి వారి ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దాదాపు రెండు నెలలుగా కురుస్తున్న వర్షాలకు చేనేతలు నష్టపోయారన్నారు. వర్షపు నీరు మగ్గం గుంతలో నిలుస్తున్నాయని తెలిపారు. పని జరగక ఉపాధి లేక చేనేత కార్మికులు అవస్థలు పడుతున్నారని చెప్పారు. ప్రభుత్వం స్పందించి వారికి ఆర్థిక సహాయం అందించాలని కోరారు. జిపి.వీరన్న, కె.కృష్ణ, జి.ఎల్లేష్, రవి, ఆదెన్న, భరణి కాలప్ప పాల్గొన్నారు.

రైతులకు పండ్ల మొక్కలు పంపిణీ

ప్రజాశక్తి - ఆస్పరి

మండలంలోని అట్టేకల్లు, బిల్లేకల్లు, ములుగుందం, హాలిగేర గ్రామాల్లోని 22 మంది రైతులకు 3 వేల పండ్ల మొక్కలను సోమవారం రామతీర్థం దగ్గర పంపిణీ చేశారు. ఎంపిడిఒ గీతా వాణి, ఎడిఎ పక్కీరప్ప మాట్లాడుతూ... పండ్ల మొక్కలు పెంపకానికి రైతులు ముందుకు రావాలని కోరారు. ఉపాధి హామీ జాబ్ కార్డు ఉండి 5 ఎకరాల్లోపు ఉన్న ప్రతి ఒక్కరికీ రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ కింద గ్రామీణ ప్రాంతాల్లో పండ్ల మొక్కలు ఉచితంగా ఇస్తోందని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏపీవో రామకృష్ణ, జూనియర్ అసిస్టెంట్ మారెన్న, టెక్నికల్ అసిస్టెంట్ హంపయ్య, షేకన్న, రైతులు పాల్గొన్నారు.

మెనూ పాటించని వార్డెన్‌ను సస్పెండ్ చేయాలి

- ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, ఐద్వా

ప్రజాశక్తి-ఆలూరు

బీసీ మేనేజ్‌మెంట్ బాలికల హాస్టల్‌లో మెనూ పాటించని వార్డెన్‌ను సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, ఐద్వా నాయకులు, విద్యార్థినులు కోరారు. సోమవారం డిప్యూటీ తహశీల్దార్ విజయ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు మైనా, ఐద్వా మండల కార్యదర్శి రత్నమ్మ, రాష్ట్ర కమిటీ సభ్యులు షేకున్ బీ మాట్లాడారు. ఆలూరులో ఉన్న బీసీ మేనేజ్‌మెంట్ కళాశాలల గర్ల్స్ హాస్టల్‌లో సుదూర గ్రామాలు, పట్టణాల నుంచి జూనియర్, డిగ్రీ, ఐటిఐ కళాశాలలో విద్యనభ్యసించే 60 మంది విద్యార్థినులు ఉంటున్నారని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం పెట్టకుండా చాలీచాలని మెనూ పెడుతూ విద్యార్థినుల కడుపుకొడుతున్నారని విమర్శించారు. హాస్టల్ వార్డెన్ సుజాత రోజూ ఇవ్వాల్సిన అరటి పండు ఇవ్వడం లేదన్నారు. గుడ్డు కూడా ఇవ్వడం లేదని, విద్యార్థినులకు ఉదయం రాగి జావా ఇవ్వడం లేదని తెలిపారు. విద్యార్థినులు ప్రశ్నించడంతో నాలుగు రోజుల క్రితం రాగి జావా ఇచ్చారని చెప్పారు. హాస్టల్ బాత్‌రూములు, వాష్ రూములను విద్యార్థినులతోనే కడిగిస్తున్నారని తెలిపారు. విద్యార్థినులు ఇబ్బందులకు గురై హాస్టల్ నుంచి కొంతమంది డ్రాప్ అవుట్ అవుతున్నారని చెప్పారు. పేరెంట్స్ మీటింగ్ పేరుతో విద్యార్థులతో రూ.50 చొప్పున డబ్బులు వసూలు చేస్తున్నారని తెలిపారు. వార్డెన్‌పై విచారణ జరిపి చర్యలు తీసుకుని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. డివైఎఫ్ఐ ప్రాంతీయ అధ్యక్షులు గోవర్ధన్, ఎస్ఎఫ్ఐ నాయకులు చంద్ర, ఐద్వా మండల నాయకులు గౌసియా, డివైఎఫ్ఐ నాయకులు మణి, ఎస్ఎఫ్ఐ నాయకులు అమరేష్, పోతురాజు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సాగునీటి సమస్యలను పరిష్కరించండి

- ఎంపీకి సిపిఎం వినతి

ప్రజాశక్తి - దేవనకొండ

ఎంపీకి వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నాయకులు

మండలంలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని సిపిఎం నాయకులు కోరారు. సోమవారం ఎంపీ బస్తిపాటి నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు బి.వీరశేఖర్, మండల కమిటీ సభ్యులు యూసుఫ్ బాష మాట్లాడారు. హంద్రీనీవా నుంచి మండలంలో 46 వేల ఎకరాలకు సాగునీరని చెబుతున్నా అధికారికంగా 10 వేలకు మించడం లేదని, ఎంపీగా చొరవ చూపి పంట కాలువలు నిర్మించడం ద్వారా సాగునీరు ఇచ్చే విధంగా ప్రయత్నం చేయాలని కోరారు. కరివేముల, తెర్నేకల్లు, జిల్లేడు బుడకల, కప్పట్రాళ్ల గ్రామాల మధ్య, ఇతర చోట్ల హంద్రీనీవా పనులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటి పూర్తికి అధికారులతో మాట్లాడి చర్యలు చేపట్టాలని తెలిపారు. హంద్రీనీవా ప్రధాన కాలువ స్లూయిజ్ ఏర్పాటుకు ఇప్పటికే పాణ్యం, పత్తికొండ నియోజకవర్గాల్లో ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని, మండలంలో గుండ్లకొండ వద్ద స్లూయిజ్‌కు అనుమతి ఇవ్వడం లేదని చెప్పారు. గుండ్లకొండ వద్ద స్లూయిజ్ ఏర్పాటు చేసి కోటకొండ, మాచాపురం వరకు సాగు నీరిచ్చే విధంగా కృషి చేయాలని కోరారు. సిపిఎం నాయకులు మహేంద్ర, నాగేంద్ర, నాయుడు, రంగన్న పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు
అధికారులు గైర్హాజరు

- కార్యాలయంలో దర్శనమిచ్చిన ఖాళీ కుర్చీలు
- నెట్ వర్క్ లేక కనిపించని వీడియో కాన్ఫరెన్స్

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అధికారులు గైర్హాజరు కావడంతో కార్యాలయంలో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ కె.రమాదేవి ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. పంచాయతీ రాజ్ ఎఇ మల్లయ్య తప్ప మిగిలిన శాఖల అధికారులు గైర్హాజరు కావడంతో వారికి కేటాయించిన కుర్చీలు ఖాళీగా కనిపించాయి. పైగా నెట్ వర్క్ లేక వీడియో కాన్ఫరెన్స్ కూడా లేకుండా ఆడియో కాన్ఫరెన్స్ ద్వారా తహశీల్దార్ రమాదేవి వింటూ ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తూ కొనసాగించారు. 1వ తేదీ కావడం వల్ల పింఛన్ల పంపిణీలో పర్సెంటేజ్ తక్కువగా ఉన్న గ్రామాల కార్యదర్శుల నుంచి వివరాలు సేకరించే పనిలో ఉన్నందున గ్రీవెన్స్‌కు రాలేదని ఎంపిడిఒ నూర్జహాన్ తెలిపారు. మిగిలిన ఇతర శాఖల అధికారులు ఎవరూ లేక గ్రీవెన్స్ వెలవెలబోయింది. ఒక వైపు నెట్‌వర్క్ సమస్య, మరోవైపు అధికారులు లేక సమస్యలపై ఫిర్యాదులు అందితే సమాధానం కోసం తహశీల్దార్ వేచి చూడాల్సిందే. ఫిర్యాదు దారులు కూడా సమస్య పరిష్కారం కోసం వేచి చూడాల్సిందే. ఉన్నతాధికారులు స్పందించి నెట్ వర్క్ లోపం లేకుండా, అధికారులు సక్రమంగా వీసీకి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు